రోడ్డు ఆక్రమణల తొలగింపు



రోడ్డు ఆక్రమణలను తొలగిస్తున్న టౌన్‌ప్లానింగ్ అధికారులు

మన్సూరాబాద్: కామినేని చౌరస్తా నుంచి మన్సూరాబాద్ చౌరస్తా వరకు సహారా ప్రధాన రోడ్డుకు ఇరువైపులా ఉన్న రోడ్డు ఆక్రమణలను హయత్‌నగర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీ పావని ఆధ్వర్యంలో తొలగించారు. ఆమె మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా నిర్మించిన తాత్కాలిక నిర్మాణాలతో తరచూ ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోందన్నారు. కామినేని చౌరస్తా నుంచి సుష్మా చౌరస్తా వరకు ఉన్న రోడ్డు ఆక్రమణలను కూడా తొలగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి అక్బర్, చైన్‌మైన్స్ మహేందర్, శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

కాలనీ రహదారులు అధ్వానం



చైతన్యపురి: ఇష్టారాజ్యంగా తవ్వకాలు జరిపి వదిలేయటంతో కాలనీల్లోని రహదారులు గుంతలమయంగా మారాయి. వాహనదారులకు ప్రమాదకరంగా మారాయి. గడ్డిఅన్నారం డివిజన్ లలితానగర్ కాలనీలోని ఇన్నర్ రోడ్లు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు ఇళ్లకు వాటర్, డ్రైనేజ్ లైన్ నిమిత్తం రోడ్డు తవ్వి, ప్యాచ్ వర్కు చేయకుండా వదిలేశారు. అంతేకాక రహదారుల మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్స్ కొన్ని దెబ్బతి ప్రమాదకరంగా మారాయి. అనుమతి లేకుండా రోడ్డు తవ్వకాలు జరిపే వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పనులు పూర్తి కాగానే ప్యాచ్‌వర్కు చేసేలా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ అధికారులు స్పందించి గుంతలుగా మారిన రోడ్లను గుర్తించి మరమ్మతు చేయించాలని కోరుతున్నారు.

హైడ్రా భయం పట్టుకుంది!

మూసీ బఫర్ జోన్ వాసుల్లో మొదలైన ఆందోళన

- స్వచ్ఛందంగా షెడ్లను తొలగించుకుంటున్న నిర్మాణదారులు
- హైడ్రా పరిధిలోకి రాకున్నా హడలెత్తిపోతున్న పరీవాహక ప్రాంత ప్రజలు
- ఇప్పటికే అంబర్‌పేట మండల పరిధిలో 1,154 నిర్మాణాలకు మార్కింగ్
- నోటీస్ లేకుండా కూల్చివేస్తారనే ఆందోళనలో యజమానులు

అంబర్‌పేట: హైడ్రా చర్యలతో హడలెత్తిపోతున్నారు. హైడ్రా చేపట్టిన చర్యలు బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణదారుల్లో గుబులు రేపుతోంది. హైడ్రా పరిధిలోకి రాకున్నా అలాంటి చర్యలు ఉంటాయిని బఫర్ జోన్ నిర్మాణదారులు బెంబేలెత్తిపోతున్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో అధికార యంత్రంగం గత నెల రోజుల క్రితం నిర్మాణాలకు మార్కింగ్ చేసింది. అంబర్‌పేట మండల పరిధిలో 1154 నిర్మాణాలకు మార్కింగ్ చేసి హద్దులు నిర్ణయించింది. మూసీ అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా ఉందంటూ వస్తున్న వార్తలతో పరీవాహక ప్రాంత ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలోని కృష్ణనగర్, శాస్త్రీనగర్, గోల్నాక లంకబస్తీలు, దుర్గానగర్‌తో పాటు ఆలీకేఫ్, హోల్‌సేల్ చికెన్ మార్కెట్‌లో ఉన్న నిర్మాణాల యజమానులు తీవ్ర భయందోళనకు గురువుతున్నారు.

◆ నష్టపోతామని స్వచ్ఛందంగా...

పక్కా నిర్మాణాల యజమానులు మినహాయిస్తే బఫర్ జోన్‌లో నిర్మించిన షెడ్ల యజమానులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. హైడ్రా తరహాలో కూల్చి వేస్తే ఆర్థికంగా నష్టపోతామని భావిస్తున్నారు. ఆలీకేఫ్ హోల్‌సేల్ చికెన్ మార్కెట్‌లో ఉన్న కొన్ని రేకుల షెడ్లలను స్వచ్ఛందంగా తొలగించుకుంటున్నారు. కనీస సమాచారం లేకుండా ఆకస్మత్తుగా తొలగింపు చర్యలు తీసుకుంటే షెడ్డులకు వినియోగించే రేకులతో పాటు అందులో ఉన్న సామగ్రి కోల్పోతామనే భయంతో కొంత మంది తొలగించుకుంటున్నారు. ఒకరిద్దరు స్వచ్ఛందంగా తొలగిస్తుంటే ఇతరుల్లో కూడా అభద్రత భావం ఏర్పడింది.

నోటీస్ లేకుండానే...

◆ మూసీ బఫర్ జోన్‌లో చేపట్టిన నిర్మాణలకు ఎలాంటి నోటీస్‌లు జారీ చేయకుండానే కూల్చివేస్తారని ప్రచారం జరుగుతోంది. నోటీస్‌లు లేకుండా కూల్చివేత చర్యలు చేపడితే ఆర్థికంగా భారీగా నష్టపోతామని పలువురు భావిస్తున్నారు. పక్క నిర్మాణలు ఉన్న యాజమానులతో ముందస్తు సమాచారంతో ఇవ్వడంతో న్యాయం చేయాలని పలువురు కోరుతున్నారు. తామకు న్యాయం చేయాలని ఇప్పటికే అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నాను కూడా చేశారు. కనీస సమాచారం ఇచ్చాకనే ఏదైనా చర్యలు తీసుకోవాలని పలువురు భావిస్తున్నారు.

హైడ్రా పరిధికి రాకున్నా...

◆ మూసీ పరీవాహక ప్రాంతం హైడ్రా పరిధికి ప్రస్తుతానికి రాదు. మూసీ అభివృద్ధి కోసం మూసీ రివర్ డెవలప్‌మెంటు అథారిటీ పరిధిలోకి వస్తుంది. హైడ్రా తరహాలో ఈ సంస్థ చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మూసీ అభివృద్ధే లక్ష్యంగా పలుమార్లు చేస్తున్న ప్రకటనలతో పరీవాహక నివాసితుల్లో గుబులు రేపుతోంది. ప్రస్తుతం దీనిపై ఎలాంటి స్పష్టత లేదు.

నోటీస్ ఇవ్వలేదు

మూసీ పరీవాహక ప్రాంతంలో ఇప్పటి వరకు మార్కింగ్ మాత్రమే చేశాం. ఇప్పటి వరకు ఎవరికీ నోటీస్‌లు ఇవ్వలేదు. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా మా చర్యలు ఉంటాయి.

– మీరాబాయి, అంబర్‌పేట తహసీల్దార్


ఆలీ కేఫ్ చౌరస్తాలో స్వచ్ఛందంగా షెడ్డును తొలగించుకుంటున్న దృశ్యం

దుర్గాదేవి ఆలయ గణనాథుడి లడ్డూ రూ.86 వేలు


గణనాథుడి లడ్డూతో ప్రతాప్‌నాయుడు దంపతులు

మన్సూరాబాద్: నాగోలు డివిజన్ పరిధి శ్రీసాయినగర్ కాలనీలోని దుర్గాదేవి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన గణనాథుడి లడ్డూ వేలం గురువారం రాత్రి నిర్వహించారు. కాలనీకి చెందిన శ్రీరస్తు శుభమస్తు ప్రాపర్టీస్ మేనేజింగ్ డైరెక్టర్ ప్రతాప్‌నాయుడు రూ.86,116కు లడ్డూను దక్కించుకున్నారు. లడ్డు వేలం అనంతరం గణనాథుడి నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు పోచబోయిన గణేశ్‌యాదవ్, యాదగిరి, హనుమంతరావు, మురళీ, అజయ్, కేశవులు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ క్రీడాకారుడికి సన్మానం


మోహన్‌రెడ్డిని సన్మానించిన సురేందర్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి

సైదాబాద్: అంతర్జాతీయ వైదికపై ఐఎస్ సదన్ డివిజన్‌కు చెందిన క్రీడాకారుడు పతకాలు సాధించడం అభినందనీయమని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు జంగం మధుకర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 14, 15 తేదీల్లో కజకిస్తాన్‌లో నిర్వహించిన స్విమ్మింగ్ పోటీల్లో సాయితిరుమల టవర్స్ వాసి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. 65–69 వయస్సు విభాగంలో నిర్వహించిన పోటీల్లో ఆయన 100, 200, 400 మీటర్ల ఫ్రీస్టైల్, 4బై50 రిలే అంశాల్లో పాల్గొని రజత, కాంస్య పతకాలు రెండు చొప్పున సాధించారు. ఈ మేరకు శుక్రవారం ఆయనను బీజేపీ నాయకులు సన్మానించారు.

పేదలకు అండగా సీఎం రిలీఫ్ ఫండ్


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందిస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్త

నాగోలు: పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని టీపీసీసీ ప్రచార కమిటీ కో–కన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్త అన్నారు. తీవ్ర అనారోగ్య సమస్యలతో ప్రైవేట్ హస్పిటల్‌లో చికిత్స పొందిన మేడిపల్లి శ్రీనివాసకాలనీ చెందిన అనసూయకు సీఎం రిలీఫ్ ఫండ్ రూ. 21 వేలు మంజూరయ్యాయి. ఈమేరకు చెక్కును ఆమె కుమారుడు శ్రీనివాస్‌కు శుక్రవారం నాగోలులోని తన నివాసంలో ఆయన అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని విధాలా ఆర్య వైశ్యులకు అండగా నిలుస్తుందన్నారు.

ఆరోగ్యకర జీవనానికి పోషకాహారం తప్పనిసరి

కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి


కార్యక్రమంలో కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: ఆరోగ్యకరమైన జీవనానికి నిత్యం పోషకాహారం తీసుకోవడం తప్పనిసరి అని ఐఎస్ సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం శ్రీసాయినగర్ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయురాలు సుంచు పద్మిని, సహాయకురాలు సక్కుబాయ్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను వీక్షించారు. అంగన్‌వాడీలు అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, మహిళలు, బాలికలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు సుజాత, రూప, అపర్ణ పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ సెక్షన్ ఆఫీసర్‌పై చర్యలు తీసుకోండి

నగర కాంగ్రెస్ మాజీ ఉపాధ్యక్షుడు మదన్

చాదర్‌ఘాట్: అక్రమ కట్టడాలకు అనుమతులు ఇస్తున్న మలక్‌పేట సర్కిల్–6 టీపీవో సెక్షన్ అధికారి సునీతపై చర్యలు తీసుకోవాలని నగర కాంగ్రెస్ పార్టీ మాజీ ఉపాధ్యక్షుడు మదన్ ఉన్నతాధికారులను కోరారు. శుక్రవారం ఆమెపై నగర టౌన్ ప్లానింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలకు సెక్షన్ ఆఫీసర్ సునీత అనుమతులు ఇచ్చి అక్రమ కట్టడాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.

రేపు ఉచిత వైద్యశిబిరం

చైతన్యపురి: దిల్‌సుఖ్‌నగర్ సాయి సంస్థాన్ ట్రస్ట్, మలక్‌పేట యశోద ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ఆలయ చైర్మన్ బీవీ శ్యాంకుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 3 గంటల వరకు ఆలయంలో నిర్వహించే ఈ వైద్యశిబిరంలో వైద్యులు జనరల్, పీడియాట్రిషన్, స్కిన్, గైనకాలజీ, ఈఅండ్‌టీ, కంటి పరీక్షలు నిర్వహిస్తారని భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అపాయింట్‌మెంటు కోసం 85009 66566, 83309 66566 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

చెత్త డంపింగ్ పాయింట్ ఎత్తేయాలి


న్యూ సమతాపురికాలనీలో చెత్త సమస్యను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ న్యూ సమతాపురి కాలనీలో రోడ్డు పక్కన చెత్త డంపింగ్ చేస్తున్నారని, దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు చేసిన ఫిర్యాదు మేరకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం సంబంధిత ఎస్ఎఫ్ఏ సూపర్‌వైజర్ లక్ష్మయ్య, రాంకీ సంస్థ సూపర్‌వైజర్ విజయభారతిని పిలిపించి వెంటనే చెత్త డంపింగ్ పాయింట్ తీసేయాలని సూచించారు. రోడ్డు మార్గంలో, కాలనీలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా చెత్తను తొలగించాలన్నారు. అనంతరం కాలనీలో రోడ్డు, వర్షపునీటి సమస్యలను పరిశీలించి పరిష్కారానికి చర్యలు చేపడతామని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భవాని, కాలనీ సెక్రెటరీ శ్రీనాథ్, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పేదలపై జులుం తగదు: బీఎస్పీ


జక్క యాదగిరి

ఎల్‌బీనగర్: జీహెచ్ఎంసీ అధికారులు పెద్దలకు కొమ్ము కాస్తూ పేదలపై జులుం చూపిస్తున్నారని బహుజన సమాజ్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్క యాదగిరి ఆరోపించారు. ఎల్‌బీనగర్‌లోని పలు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలను జీహెచ్ఎంసీ అధికారులు తొలగించడంపై ఆయన విచారం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు చెరువులను బడా నాయకులు కబ్జా చేసి పెద్ద పెద్ద భవనాలు కట్టినా పట్టించుకోని అధికారులు, ఫుట్‌పాత్‌లపై చిరు వ్యాపారులపై మాత్రం ప్రతాపం చూపుతున్నారని ఆరోపించారు. కనీసం సమయం ఇవ్వకుండా వారి వస్తువులను ధ్వంసం చేసి జీవనోపాధి దెబ్బతీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

రోడ్లపై పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు

వనస్థలిపురం ట్రాఫిక్ సీఐ భూపతి గట్టుమల్లు



హస్తినాపురం: నాగార్జునసాగర్, విజయవాడ జాతీయ రహదారుల సర్వీస్ రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు హెచ్చరించారు. గురువారం వనస్థలిపురంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 'సాక్షి'తో ఆయన మాట్లాడుతూ వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని గుర్తించి నోటీసులు జారీచేసి జరిమానాలు విధించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలకు ఆస్కారం ఉండదని అన్నారు. విజయవాడ జాతీయరహదారి విస్తరణ పనులు జరుగుతున్నందున వ్యాపార సముదాయాల వారు ఎవరు కూడా సర్వీస్ రోడ్లను ఆక్రమించవద్దని అన్నారు. రాచకొండ పోలీస్ కమీషనర్ ఆదేశాల మేరకు జంబ్లింగ్ పద్ధతిలో డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తున్నామని, మద్యం తాగి వాహనాలు నడిపితే వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

లడ్డూ వేలం


ఐలేని నర్సింహారావు తనయుడికి లడ్డూ అందజేస్తున్న సునీల్‌బాబు

చైతన్యపురి: వివేకానంద నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణపతి మండపంలోని లడ్డూను ఐలేని నర్సింహారావు రూ. 85 వేలకు దక్కించుకున్నట్లు నిర్వాహకుడు మద్దెల సునీల్‌బాబు తెలిపారు. ఈ మేరకు గురువారంరాత్రి లడ్డూ వేలం నిర్వహించినట్లు చెప్పారు. పూజల అనంతరం ఐలేని కుమారుడికి లడ్డూను అందజేసినట్లు తెలిపారు. మరో లడ్డూను పీర్జాదిగూడ వాసి వినయ్‌కుమార్ గుప్త వేలంలో రూ.35,111లకు కైవసం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

'శ్రీ ఇందు' విరాళం


రేవంత్‌రెడ్డికి చెక్కును అందజేస్తున్న వెంకట్‌రావు

వనస్థలిపురం: శ్రీ ఇందు గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ (ఇబ్రహీంపట్నం), వనస్థలిపురం లయోల విద్యాసంస్థల చైర్మన్ రంగినేని వెంకట్‌రావు వరద బాధితుల సహాయం కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 లక్షల చెక్కును శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు.

అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ముషీరాబాద్: సీతాఫల్‌మండిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2024–25 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపక నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రధానాచార్యులు డాక్టర్ ఎం.రామచంద్రం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంగ్లిష్ పోస్టుకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థికి పీజీలో 55 శాతం మార్కులు(ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50 శాతం) ఉండాలన్నారు. పీజీతో పాటు స్లెట్, సెట్, నెట్, పీహెచ్‌డీ అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 21వ తేదీ సాయంత్రం 5గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నం.98851 97765లో సంప్రదించాలని కోరారు.

భావ తరంగాలు పుస్తకావిష్కరణ

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రముఖ రచయిత మధుమోహన్ హృదయగిరి రచించిన భావతరంగాలు పుస్తకాన్ని శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రముఖ సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కవిత్వం రాశారంటేనే కారణజన్ముడని భావించాలని అన్నారు. సమాజాన్ని చైతన్యం కలిగించే భావ కవిత్వాన్ని రచించడం గొప్ప విషయమని అన్నారు. విమర్శ అనేది మనిషి ఎదిగేందుకు ఉపయోగపడాలి తప్ప దిగజారేలా ఉండకూడదని అన్నారు. కవులు, కళాకారులను ప్రోత్సహిస్తే మరింత చైతన్యవంతమైన కవిత్వం రాయగలుగుతారని అన్నారు.

రైతుబజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్‌లలో కూరగాయల ధరల వివరాలు (కిలో రూపాయల్లో).. టమోటా రూ.37, వంకాయ రూ.35, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.26, కాకరకాయ రూ.50, బీరకాయ రూ.50, కాలీఫ్లవర్ రూ.23, క్యాబేజీ రూ.21, క్యారెట్ రూ.45, దొండ రూ.45, ఆలుగడ్డ రూ.38, ఉల్లిగడ్డ రూ.54, గోకరకాయ రూ.50, దోసకాయ రూ.23, సొరకాయ రూ19, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.10, చిక్కుడుకాయ రూ.85, అర్వి రూ.35, మునగ రూ.45, చిలగడదుంప రూ.65, బీట్‌రూట్ రూ.28, కీర రూ.33, బీన్స్ రూ.55, క్యాప్సికం రూ.70. ఈరోజు శనివారం ఉదయం 9 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి.



ఎంపీకి ఆహ్వానం


ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానపత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

చైతన్యపురి: దిల్‌సుఖ్ నగర్ స్వర్ణకార విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించే శ్రీవిరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలకు మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆహ్వానించినట్లు యజ్ఞ కమిటీ చైర్మన్ సత్యంచారి, కోశాధికారి రవిచారి తెలిపారు. ఈ మేరకు ఎంపీని ఆయన నివాసంలో శుక్రవారం కలిసి ఆహ్వాన పత్రిక అందజేసినట్లు చెప్పారు. విశ్వబ్రాహ్మణ కుటుంబాలు విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకల్లో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్వర్ణకార సంఘం మాజీ అధ్యక్షుడు అనంతాచారి, గౌరవ సలహాదారు శ్రీనివాసచారి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల ఉద్యోగులను సమీకృత డైరెక్టరేట్ పరిధికి తేవాలి


ఆకునూరి మురళికి వినతిపత్రం సమర్పించిన సంస్థ ప్రతినిధులు

చాదర్‌ఘాట్: అన్ని ప్రభుత్వ గురుకుల సొసైటీలలోని సుమారు 33 వేల మంది ఉద్యోగులను సమీకృత డైరెక్టరేట్ పరిధిలోకి తీసుకు రావాలని తెలంగాణ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ లెక్చరర్స్ ఎంప్లాయీస్, ప్రిన్సిపాల్ అండ్ టీచర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పి.సుధాకర్ కోరారు. శుక్రవారం సంస్థ ప్రతినిధులతో కలిసి విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన అన్ని జీఓలను గురుకుల సొసైటీలకు వర్తింపజేయాలన్నారు. ప్రభుత్వ గురుకులాల సమీకృత నూతన విద్యా విధానంలో భాగంగా 5 నుంచి 8వ తరగతి వరకు ఒక దగ్గర, 9 నుంచి 12 వరకు మరో దగ్గర, డిగ్రీ పీజీ కాలజీలు ఇంకో దగ్గర ఏర్పాటు చేసే విధంగా అవసరమైన స్టాఫ్ ప్యాటరన్ రూపొందించాలని కోరారు.